క్లుప్తంగా

సమస్యల పరిష్కారంపై దృష్టి



స్పందనలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

కర్నూలు (టౌన్) : ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన పలువురు కమిషనర్‌ను కలిసి సమస్యలపై అర్జీలు అందజేశారు. శ్రీరామ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేయాలని ఆ కాలనీకి చెందిన పవన్‌కుమార్ విన్నవించారు. వినతుల స్వీకరణ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, డిప్యూటీ కమిషనర్ రమాదేవి, ఎస్ఈ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

- జగనన్న సురక్ష, స్పందన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వాటిని పరిష్కరిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి డాక్టర్ సృజన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని మాట్లాడారు.

జీప్యాట్ ఫలితాలు విడుదల



మాట్లాడుతున్న కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్–2023(జీప్యాట్) ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆ కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ పాల్గొని ప్రసంగించారు. జీప్యాట్ ప్రవేశ పరీక్ష ఈ ఏడాది మే 22వ తేదీన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిందని, ఈ పరీక్షలో పొందిన ర్యాంకు ఆధారంగా ఎం–ఫార్మసీ విద్యను అభ్యసించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. తమ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థుల్లో ఆల్ ఇండియా లెవెల్‌లో కె.రాకేష్ 4,772వ ర్యాంకు, ఎం.ఇమ్రాన్ 5,096వ ర్యాంకు, సి.మాన్య కిశోర్ 11,768వ ర్యాంకు, బి.శ్రావణి 12,866వ ర్యాంకు, పి.సుధీర్ 12,866వ ర్యాంకు, ఎం.భవాని 13,764వ ర్యాంకు, వి.దినేష్‌కుమార్ 25,517వ ర్యాంకు సాధించారన్నారు. కార్యక్రమంలో కాలేజీ అకడమిక్ అడ్వైజర్ స్టెల్లా సతీష్, ప్రిన్సిపాల్ డా.జె రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

6న సెమినార్



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ 'విద్యార్థి యువత ఉన్నత లక్ష్యాల సాధన' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుభాష్ చంద్రబోస్ వెల్లడించారు. సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతకు అవగాహన కల్పించేందుకు సెమినార్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సెమినార్‌కు జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, ఎస్పీ కృష్ణ కాంత్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ గురుకులం ఫర్ ఐఏఎస్ ఫౌండర్ అక్కెళ్ల రాఘవేంద్ర ముఖ్య వక్తగా హాజరై వివిధ పోటీ పరీక్షలపై అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులలో కూడా సెమినార్‌లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పెట్టుబడులు వద్దు

కర్నూలు(సెంట్రల్):సహకార రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు తీసుకొచ్చిన ప్రైవేట్ పెట్టుబడులను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు కోరారుజ సోమవారం కలెక్టరేట్ ఎదుట అయూనియన్ ఆధ్వర్యంలో సహ కార ఉద్యోగుల ఐక్య వేదిక ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకారం రంగంలో అనేక మార్పులు వస్తున్నాయని, ఆయా మార్పులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని చెప్పారు. సహకార సంఘం జేఏసీ నాయకుడు మురళీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ యూనియన్ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేశారన్నారు.ఆంధ్రప్రదేశ్‌లోనూ రెగ్యులర్ చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు.





అశోక్‌నగర్‌లో సాయిబాబాకు హారతి, బిర్లాగేట్ సమీపంలోని దేవాలయంలో బాబాను దర్శించుకుంటున్న భక్తులు



ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



చిన్మయ మిషన్‌లో సుప్రేమానంద స్వామిని సన్మానిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

జయ జయ సాయి

- ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన సాయినాథుని ఆలయాలు
- మార్మోగిన సాయి నామ స్మరణ
- గురువులకు సన్మానం

కర్నూలు కల్చరల్: వ్యాస మహర్షి జయంతిని పురస్కరించుకుని సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాలోని సాయిబాబా, దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినాథునికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, శ్రీ సాయి జయ జయ సాయి నామ అఖండ భజన, సామూహిక కుంకుమార్చనలు, అన్నప్రసాద వితరణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలి రావడంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. ఆధ్యాత్మిక గురువులు, యోగా గురువులు, వివిధ పీఠాధిపతులను శిష్యులు సత్కరించి ఆశీర్వాదాలు పొందారు.

☛ కర్నూలు ఓల్డ్‌సిటీలోని దక్షిణ షిరిడీ సాయి, బాలాజీ నగర్, సరస్వతి నగర్, అశోక్‌నగర్‌లలో ప్రసన్నాంజనేయ ద్వారకా సాయినాథ, నెహ్రూనగర్‌లోని భగవాన్ సత్యసాయి , సాయిబాబా సంజీవ నగర్‌లోని భగవాన్ బాలసాయి, సూర్యనారాయణ స్వామి , నాగసాయి , వినాయక్ ఘాట్, ఆదిత్యనగర్, సంకల్ బాగ్ హరిహర తదితర ఆలయాల్లో గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు సుప్రేమానంద, లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం భక్తులకు సందేశమిచ్చారు. గురువులు జీవిత మార్గదర్శకులని వారి అడుగు జాడల్లో నడవాలని సూచించారు.



అలంకరణలో దత్తాత్రేయ స్వామి

☛ పతంజలి సాయినాథ్ యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో వీఆర్ కాలనీ కేంద్రంలో యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య దంపతులను యోగా కేంద్రం కార్యదర్శి రేగురు బాలకృష్ణ, సభ్యులు రంగస్వామి, కేశవరావు, సుచరిత, రామసుబ్బమ్మ తదితరులు ఘనంగా సన్మానించారు.

☛ చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద, లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, ఉత్తారిధి మఠం అధికారి పగడాల రామూర్తి ఆచార్యులు, నాదానంద, స్వాత్మానంద, భానుమతమ్మలను వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, ఉపాధ్యక్షులు గోవిందరాజులు, కోశాధికారి అయోధ్య శ్రీనివాస్,బజరంగ్ దళ్ నాయకులు ప్రతాప్‌రెడ్డి తదితరులు సన్మానించారు.



దక్షిణ షిరిడీ సాయిబాబా దేవాలయంలో స్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

ఘనంగా వ్యాస జయంతి వేడుకలు

కర్నూలు(అర్బన్): గురు పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం నగరంలోని బీసీ భవన్‌లో వ్యాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా వ్యాస మహర్షి చిత్రపటానికి పూల మాల వేసి పూజలు నిర్వహించారు. సంఘం నగర అధ్యక్షుడు గ్యాస్ శ్రీనివాసులు మాట్లాడుతూ మహాభారతం, భాగవతం, అష్టాదశ పురాణాలను వ్యాస భగవానుడు అందించారని, వేదాలను నాలుగు భాగాలుగా చేసిన నేపథ్యంలో ఆయనకు వేద వ్యాసుడని పేరు వచ్చిందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎద్దుల వెంకటేష్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, భాస్కర్, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



పతంజలి సాయినాథ్ యోగా కేంద్రంలో యోగా గురువు దత్తయ్యకు నమస్కారం చేస్తున్న శిష్యులు



బీసీ భవన్‌లో వ్యాస జయంతి వేడుకలు

అవీ-ఇవీ

రామకృష్ణ సేవలు మరువలేనివి

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ఫిజిక్స్ విభాగంలో పని చేసి రిటైర్డ్ అయిన రామకృష్ణ శనివారం హఠాన్మరణం పొందారు. దీంతో వర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెక్టార్ వీసీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ రామకృష్ణ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాన్ టిచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సురేంద్ర బాబు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ ఎన్‌టీకే నాయక్, ఎగ్జామ్స్ ఆఫ్ డీన్ విశ్వనాథరెడ్డి, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య భరత్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్యామల సరోజమ్మ, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిజికల్ టెస్ట్ నిర్వహించాలి

కర్నూలు(సెంట్రల్) : ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు వెంటనే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శిరీష, శంకర్, రంగప్ప, హుస్సేన్ బాష, విక్రమ్, హరికిషన్, అమర్, అంజి, రఘు, శివ పాల్గొన్నారు.

సరెండర్ లీవ్ ఇప్పించండి

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న పర్మినెంట్ పారిశుద్ధ్య కార్మికులకు సరెండర్ లీవ్ మంజూరు చేయాలని ఏఐటీయూసీ పారిశుద్ధ్య కార్మిక సంఘం కార్యదర్శి చంద్రశేఖర్, పులగం మద్దిలేటి విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో కమిషనర్ భార్గవ్‌తేజను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

చుక్కల భూముల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఐక్యవేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు.

5న ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల వర్క్‌షాప్

కర్నూలు(రూరల్): నగరంలోని కేకే భవన్‌లో ఈనెల 5వ తేదీ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల వర్క్‌షాప్ జరుగుతుందని, దీనిని జయప్రదం చేయాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మప్ప, ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

కలసికట్టుగా పనిచేద్దాం

కర్నూలు(న్యూసిటీ): నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాల్వ శ్రీనివాసులు అన్నారు. కర్నూలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బీటీ నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం నంద్యాల రోడ్డులో ఉన్న దేవి ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాల్వ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

కర్నూలు సిటీ: అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన చేపడుతున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జె.మహేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఏబీవీపీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

దేశద్రోహం కేసు నమోదు చేయాలని వినతి

కర్నూలు: ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాపై విధ్వంసకర వ్యాఖ్యలు చేసిన వారిపై దేశద్రోహం, క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు హరీష్ బాబు డిమాండ్ చేశారు. తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో వీడియోలు సెర్చ్ చేస్తున్న క్రమంలో తనకు ఒక వీడియో కనిపించిందని, అందులో ఒక మతానికి చెందిన వ్యక్తి యూనిఫాం సివిల్ కోడ్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతూ ప్రధాన మంత్రి, హోం మంత్రిని హత్య చేసి తన దగ్గరకు రావాల్సిందిగా మాట్లాడాడని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్‌ను సోమవారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు.

సీసీ రోడ్డు వేయాలి

కర్నూలు (రూరల్) : నగరంలోని 45వ వార్డు అశోక్‌నగర్ నుంచి మమతా నగర్ మీదుగా బాలాజీ నగర్ వరకు సీసీ రోడ్డు వేయాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు కోరారు. ఆ పార్టీ 45వ వార్డు కార్యదర్శి జేఎండీ ఉస్మాన్ బాషా, మరికొందరు నాయకులు వార్డు పర్యటన చేశారు.

6 లోపు ఏజెన్సీలకు దరఖాస్తు చేసుకోండి


కర్నూలు (టౌన్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పిచికారీ చేసేందుకు ఏజెన్సీలు ఈనెల 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన ఏజెన్సీలు, సొసైటీలు, కాంట్రాక్టర్లు తమ కొటేషన్లను సీల్డ్ కవర్‌లో నగరపాలక సంస్థ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

కర్నూలు(రూరల్): జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని డీసీసీ అధ్యక్షుడు సుధాకర్ బాబు అన్నారు. సోమవారం నగరంలోని కళా వెంకట్రావ్ భవనంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుధాకర్ బాబు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఏఐసీసీ కార్యదర్శి మయప్పన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి జిల్లా పర్యటనకు వస్తున్నారన్నారు.

యోగాతో వ్యాధులు నయం


కర్నూలు(అర్బన్) : యోగాలో ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయడం వల్ల అనేక వ్యాధులు నయమవుతాయని యోగా కేంద్రం గౌరవాధ్యక్షుడు సముద్రాల హనుమంతరావు అన్నారు. సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక కిడ్స్ వరల్డ్‌లోని యోగా కేంద్రంలో యోగా గురువులు శ్రీవాణి, కళ్యాణ్, బలరాం దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా కేంద్రంలో పురుషులు, మహిళలకు ఉదయం 6 నుంచి 7:30 గంటల వరకు యోగా క్లాసులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్రం అధ్యక్షులు కాశీ విశ్వనాథ్, కార్యదర్శి బలరాం, కోశాధికారి మీరాబాయి తదితరులు పాల్గొన్నారు.



యోగా గురువు శ్రీవాణిని సన్మానిస్తున్న కేంద్రం నిర్వాహకులు

డెంగీపై అవగాహన పెంచాలి

కర్నూలు(హాస్పిటల్): డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన పెంచాలని డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య చెప్పారు. సోమవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో డెంగీ మాసోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు డెంగీపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఏఎంఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

కర్నూలు : కర్నూలు నుంచి నందికొట్కూరుకు వెళ్లే రోడ్డులో పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజ్ సమీపంలో గత నెల 28వ తేదీ గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. తల, ముఖం నుజ్జునుజ్జు అయి గుర్తు పట్టని విధంగా పడివుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉండి 5.5 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ రంగు ఉంటాడు. ఆరెంజ్ కలర్, నలుపు గళ్లు కలిగిన టవాలు ధరించాడు. లైట్ పసుపు కలర్ అంగీ ముఖంపై కప్పబడి ఉంది. స్థానికుల సమాచారం మేరకు హిట్ అండ్ రన్ కేసుగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 91211 01063 లేదా 91211 01064 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్ఐ రామయ్య కోరారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు

కర్నూలు: గంజాయి విక్రయదారులు నలుగురిని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. జొహరాపురానికి చెందిన జితేంద్ర, బంగారుపేటకు చెందిన అజయ్, పాతబస్తీకి చెందిన సలావుల్లా, తెలుగు రాజేష్ తదితరులు కొంతకాలంగా రహస్య ప్రదేశాల్లో యువకులు, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయాలు జరుపుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో వారు సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించి నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 650 గ్రాములు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని విక్రయదారులను రిమాండ్‌కు పంపినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

మద్యం కేసులో ఇద్దరు అరెస్టు

కల్లూరు మండలం ముజఫర్ నగర్‌కు చెందిన రాంగోపాల్‌రెడ్డి, కల్లూరు ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ బాషా తెలంగాణ నుంచి తక్కువ ధరకు మద్యం తీసుకువచ్చి కర్నూలులో విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో నిఘా వేసి ఇరువురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు నాలుగో పట్టణ ఎస్ఐ పెద్దయ్య నాయుడు తెలిపారు. వీరు గతంలో మట్కా నిర్వహణలో కూడా పలుమార్లు జైలుకు వెళ్లినట్లు తెలిపారు.

నాలుగు లారీల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి, కంకర తరలిస్తున్న నాలుగు లారీలను విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు కల్లూరు మండలం ఉల్లిందకొండ వద్ద ఉమ్మడి కర్నూలు జిల్లా విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. వాహన యాజమానులపై కేసులు నమోదు చేసి రూ.70 వేలు జరిమానా విధించినట్లు డీడీ వెల్లడించారు.

శ్రీమఠంలో జిల్లా జడ్జి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని కర్నూలు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీనివాసరావు సోమవారం దర్శించుకున్నారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా జడ్జికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

డీఎడ్ థర్డ్ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించండి

కర్నూలు సిటీ: డీఎడ్ థర్డ్ సెమిస్టర్ 2021–23 బ్యాచ్‌కి చెందిన పరీక్ష ఫీజు ఈ నెల 7వ తేదీలోపు చెల్లించాలని డీఈఓ డా.వి. రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సబ్జెక్టులకు రూ. 250, మూడు సబ్జెక్టులు అయితే రూ.175, రెండు సబ్జెక్టులు అయితే రూ.150, ఒక సబ్జెక్టుకు అయితే రూ.125 ప్రకారం చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుముతో ఈ నెల 14వ తేదీ వరకు చెల్లించవచ్చునని, ఈ నెల 20వ తేదీలోపు ఆయా కాలేజీలకు చెందిన యాజమాన్యాలు నామినల్ రోల్స్ ప్రభుత్వ పరీక్షల విభాగానికి పంపించాలన్నారు.

నేడు తాండ్రపాడు ప్రాంతాల్లో విద్యుత్ కోత

కర్నూలు(రాజ్‌విహార్): టిడ్కో సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ పనులు జరుగుతున్న కారణంగా మంగళవారం బి. తాండ్రపాడు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ డీఈఈ వై. సుబ్బన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాతాశిశు మరణాలు నివారించాలి

కర్నూలు(హాస్పిటల్):గ్రామాల్లో అవగాహన లేమితోనే మాతాశిశు మరణాలు జరుగుతున్నాయని, వాటిని నివారించాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ అన్నారు. మహిళా ప్రాంగణంలో ఆశా కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. గర్భిణులు, చిన్నపిల్లలకు సమయానుసారంగా టీకాలు ఇప్పించాలని చెప్పారు. అంతేగాక ఆ వివరాలను ఎంసీపీ కార్డులో కూడా నమోదు చేసి వాటి ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవానీ మాట్లాడుతూ వ్యాధినిరోధక టీకాలకు అర్హులైన గర్భిణులు, పిల్లల జాబితాను ఒక రోజు ముందుగానే తయారు చేసుకుని వారందరినీ వ్యాధినిరోధక టీకాల కేంద్రానికి తరలించాలని చెప్పారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారిణి ప్రమీలదేవి, డీపీహెచ్ఎన్ఓ ఇందిర, హెచ్ఈఈఓ శ్రీనివాసులు, ఎస్‌బీసీసీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, పీసీ పీఎన్‌డీటీ ప్రోగ్రామ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

జి.పుల్లారెడ్డిలో బూట్ క్యాంప్

కర్నూలు సిటీ: జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో డ్రోన్ సాంకేతికత అంశంపై అవగాహనకు ఐదు రోజుల పాటు నిర్వహించే బూట్ క్యాంపును సోమవారం ప్రారంభించారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ విభాగం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆధ్వర్యంలో ఈ క్యాంప్ జరుగుతుంది. ఐఐఐటీ–డీఎం డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు ముఖ్య అతిథిగా హాజరై క్యాంపును ప్రారంభించి ప్రసంగించారు. రాబోవు సాంకేతిక అంశాలపై విద్యార్థులు, అధ్యాపకులు విజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డ్రోన్ల ఉపయోగం సామాజిక, పారిశ్రామిక, రక్షణ రంగాల్లో విస్తృతమవుతుందన్నారు. అనంతరం ఐఐటీడీఎం అధ్యాపకులు డా.ఈశ్వరమూర్తి, డా.క్రిష్ణనాయక్, డా.సత్యబాబు ప్రారంభ ఉపన్యాసాలు చేశారు.

నేషనల్ అడ్వెంచర్ అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 2022 సంవత్సరానికి గాను టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి పి.వి.రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యక్రమాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సాహస క్రీడల్లో తమను తాము అంకితం చేసుకుని నైపుణ్యాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు జీవిత కాల సాఫల్యం కింద ఈ అవార్డును ప్రతి సంవత్సరం ఆగస్టు 29న రాష్ట్రపతి చేతుల మీదుగా బహూకరిస్తున్నారన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసాపత్రం, రూ.15 లక్షల నగదు బహుమతిని అందజేస్తారన్నారు. ఈ అవార్డుకు వెబ్‌సైట్ https:// awards.gov.in ద్వారా ఈనెల 14వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిర్ణీత దరఖాస్తు ఫారం, తాము చేసిన సాహస కృత్యాల వివరాలతో ఈనెల 6వ తేదీ లోపు కల్లూరు ఎస్టేట్‌లోని జిల్లా యువజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

28 నుంచి మహిళల పోరు యాత్ర

కర్నూలు (రూరల్): దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులను నిరసిస్తూ ఈ నెల 28 నుంచి ఆగస్టు 9 వరకు మహిళ పోరు యాత్ర నిర్వహిస్తున్నట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు తెలిపారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐద్వా నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ, ధనలక్ష్మి, పద్మ, సుజాత, షబాన, పర్వీన్, సీతమ్మ, సావిత్రి, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

సంక్షేమానికి సర్టిఫికెట్

- పైసా ఖర్చులేకుండా వివిధ సేవలు
- 24 గంటల్లోనే ధ్రువీకరణ పత్రాలు మంజూరు

కర్నూలు (టౌన్) : ప్రభుత్వం ప్రజలు అవసరమైన సేవలను ఉచితంగా అందజేస్తుంది. గతంలో ఏ చిన్న ధ్రువీకరణ పత్రం కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి ఉండేది. ఇప్పుడు ఎక్కడికీ వెళ్లకుండా.. ఎవరి సిఫార్సులు లేకుండా.. పైసా ఖర్చు లేకుండా అవసరమైన పత్రాలు అందించేందుకు, అర్హత ఉండి ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉండేవారిని లబ్ధిదారులుగా చేర్చేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది.ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని 133 సచివాలయాల్లో 11 రకాల సర్వీసులకు సంబంధించిన సర్టిఫికెట్లు అందజేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో అధిక మంది పిల్లల చదువు కోసం క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరికి ఒక్క రోజులోనే వలంటీర్లు ఆయా సర్టిఫికెట్లు తెచ్చి ఇస్తున్నారు.

ఒక్క రోజులోనే..



నగరపాలక ఇంజినీరింగ్ విభాగం అధికారుల నుంచి కుల ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఈమె పేరు లక్ష్మీదేవి. హౌసింగ్ బోర్డు కాలనీలో నివసించే ఈమె 46వ సచివాలయం పరిధిలోకి వస్తుంది. గతంలో ప్రభుత్వ పథకాల కోసం కుల ధ్రువీకరణ పత్రం పొందాలంటే చాలా ఇబ్బంది పడేది. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరిగేది. శనివారం తనకు కులధ్రువీకరణ పత్రం కావాలని వలంటీర్‌కు తెలియజేసింది. అందుకు అవసరమైన వివరాలు అందజేసింది. అదే రోజు మధ్యాహ్నమే పైసా ఖర్చులేకుండా క్యాస్ట్ సర్టిఫికెట్ తెచ్చి ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేశారు.

రూపాయి ఖర్చు లేకుండా..

ఈమె పేరు కె. నారాయణమ్మ. శారదా నగర్‌లో నివసిస్తున్నారు. పిల్లలు కాలేజీల్లో చదువుతున్నారు. వారికి స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ మంజూరుకు ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం. ఈ విషయం 46 వ సచివాలయ ఉద్యోగులకు తెలియజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం కింద రూపాయి ఖర్చులేకుండా సర్టిఫికెట్ మంజూరు చేశారు. ఎలాంటి సిఫార్సు లేకుండా ఒక్క రోజులోనే అవసరమైన ఆదాయ ధ్రువీకరణ పత్రం ఇంటికి రావడంతో ఆనందం వ్యక్తం చేశారు.

